క్లుప్తంగా

19న విద్యుత్ లోకల్ కోర్టు

కమలాపూర్ : విద్యుత్ వినియోగదారులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు మండల కేంద్రంలోని 33/11 కెవీ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఈనెల 19వ తేదీన విద్యుత్ వినియోగదారుల లోకల్‌కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు టీఎస్ఎన్పీడీసీఎల్ చైర్ పర్సన్ (ఎఫ్ఏసీ), సీజీఆర్ఎఫ్–1 కె.తిరుమల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్చటం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, తదితర సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

20లోపు దరఖాస్తులు చేసుకోవాలి

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుభాషిణిదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వ తేదితో దరఖాస్తు గడువు ముగియనుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు నాల్గోతరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఫిబ్రవరి 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. మెరిట్ రిజర్వేషన్లు ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

నర్సంపేట: టీఎస్‌డబ్ల్యూఆర్ఐఎస్, టీటీడబ్ల్యూఆర్ఈఐఎస్, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్, టీఆర్ఈఐఎస్ గురుకులాల్లో 2024–25 విద్యాసంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని నర్సంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కుమారస్వామి తెలిపారు. విద్యార్థులు ఈనెల 18 నుంచి 20 వరకు రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2023–24లో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు అర్హులని అన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఆదివారం ఉంటుందన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఆర్థికసాయం



గీసుకొండ: మండలంలోని ఎలుకుర్తిహవేలి గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం గీసుకొండకు చెందిన రిటైర్డ్ స్టేట్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ బుధవారం రూ. 10 వేల సాయం అందించారు. ఎలుకుర్తి యువతకు సాయం అందించగా నాయకులు రడం భరత్, గాజర్ల గోపి, రడం శ్రీధర్, దర్శనాల రాజు, పొగాకు కిష్టయ్య, మందల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

యువత శాంతిమార్గాన్ని అనుసరించాలి



గీసుకొండ: యువత శాంతి మార్గాన్ని అనుసరించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రావు విద్యార్థులకు సూచించారు. మండలంలోని కొనాయమాకుల వద్ద గల కళాశాలలో బుధవారం జాతీయ యువజన వారోత్సవాలను నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా యూత్ ఫర్ పీస్ డేను నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లా యువజన అధికారి చింతల అన్వేశ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం వాలంటీర్ గాలి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

చెన్నారావుపేట: మండలంలోని ఉప్పరపల్లికి చెందిన కుక్కల కట్టయ్యను వీధి కుక్క కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం పొలానికి నీళ్లు పెట్టడానికి వెళ్తున్న క్రమంలో కుక్క మీదికి ఎగబడి ముఖాన్ని కొరికింది. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, వారంలో పది మందికి పైగా కుక్కలు గాయపర్చాయని స్థానికులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కుక్కల బెడద నుంచి విముక్తి కల్పించాలని, వాటిని పట్టించి ఇతర ప్రాంతాలకు తరలించి నియంత్రించాలని కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల వేడుకోలు
- పలు అంశాలపై చర్చ
- సాదాసీదాగా కొనసాగిన సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సమ్మిరెడ్డి

వేలేరు : 'అప్పులు తెచ్చినం, బంగారం తాకట్టు పెట్టి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను నెట్టుకొస్తున్నాం. పెండింగ్ బిల్లులు ఇప్పించి మమ్మల్ని ఆర్థిక కష్టాల నుంచి బయటపడేయండి మహాప్రభో' అంటూ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు వేడుకున్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సమ్మిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాల సర్పంచ్‌లు వారి సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను కొనసాగించేందుకు అప్పులు చేశామని, బంగారం తాకట్టు పెట్టామని వాపోయారు. అప్పులకు వడ్డీలు, బంగారానికి నెలవారి కిస్తీలు పెరుగుతున్నాయని, కానీ పెండింగ్ బిల్లులు రావడం లేదని మండిపడ్డారు. వెంటనే తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. అనంతరం జెడ్పీటీసీ చాడ సరిత మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పర్మనెంట్ డాక్టర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆస్పత్రికి వచ్చిన నిధులు కూడా వెనక్కి వెళ్తున్నాయని, వెంటనే డాక్టర్‌ను నియమించాలని కోరారు. అలాగే విద్యుత్ శాఖ ఏఈ పోస్ట్‌ను భర్తీ చేయాలని అన్నారు. కొత్తగా నిర్మించిన బీటీ రోడ్లపై ట్రాక్టర్ డ్రైవర్లు కేజీవీల్స్ నడపడంతో రోడ్లు గుంతలు పడుతున్నాయని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అనంతరం మల్లికుదుర్ల సర్పంచ్ గొడెల రాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రముఖ పుణ్యక్షేత్రమైన గట్టు మల్లన్న దేవాలయం గుట్ట వరకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని కోరారు. వివిధ గ్రామాలకు గతంలో నైట్ హాల్ట్ బస్సులు వచ్చేవని, ఇప్పుడు రావడం లేదని ఆ సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. వైస్ ఎంపీపీ ఆంగోత్ సంపత్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాయిత మాధవరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, కో ఆప్షన్ సభ్యుడు జాని, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి



నర్సంపేట రూరల్ : వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట రూరల్ : ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణిస్తూ, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో సామా జగన్ మోహన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే కాకతీయ హెరిటేజ్ 2024 యువజన ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. ఈ యువజన ఉత్సవాలు జనవరి 19వ తేదీన నుంచి 29వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనే వారే జనవరి 18వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాకం రాకేష్, సంఘం ప్రశాంత్ శివకుమార్, శ్రీకాంత్, జయముఖి కళాశాల పీఈటీ వెంగళరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు మేనేజర్ ఆదివంశీ

నర్సంపేట రూరల్ : సంఘాలకు ఇచ్చిన అప్పులను, పొదుపులను క్రమం తప్పకుండా బ్యాంక్‌లో చెల్లిస్తూ గ్రామస్థాయిలో సంఘాలను బలోపేతం చేసుకోవాలని సర్వాపురం స్టేట్‌బ్యాంక్ మేనేజర్ ఆదివంశీ అన్నారు. సర్వాపురంలో కాకతీయ గ్రామైక్య సంఘం మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రసంగించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతోనే బ్యాంకుల నుంచి రుణాలు అందిస్తున్నామని, ఆ రుణాలను సద్వినియోగం చేసుకుంటూ కుటీర పరిశ్రమలు స్థాపించుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా బ్యాంకులో లావాదేవీలు జరిపించాలని, లావాదేవీలు సక్రమంగా చెల్లించకపోతే రుణాలు సకాలంలో అందవని అన్నారు. సకాలంలో లావాదేవీలు చేసి రుణాలు పొందాలని సూచించారు. టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు ఆడెపు రమాదేవి, అకౌంటెంట్ మాధవి, కాకతీయ గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు గోపాల పద్మ, కార్యదర్శి శశికళ, కోశాధికారి జన్ను పద్మ, ఆర్పీ రమ, సభ్యులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేయించాలి



వినతిపత్రం అందజేస్తున్న చేనేత లబ్ధిదారులు

హన్మకొండ అర్బన్: మడికొండ టెక్స్‌టైల్ పార్కు పాలకవర్గం, బిల్డర్లు, కెనరా బ్యాంక్ అధికారులు కుమ్మక్కై చేనేత లబ్ధిదారులను నమ్మించి మోసం చేశారని, ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేయించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలస కార్మికుల నిర్మూలనలో భాగంగా కార్మికుల ఉపాధి కల్పనకు అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ స్కీం కింద 2019లో ఒక్కో లబ్ధిదారుడికి రూ. 92.50 లక్షల చొప్పున వరంగల్, హనుమకొండ కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ల ద్వారా నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఆ నిధులతో మడికొండ శివారులో 60 ఎకరాల భూమిని సొసైటీకి చెందిన 364 మంది సభ్యులకు ఒక్కొక్కరికి 450 చదరపు గజాల చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కేటాయించినట్లు వివరించారు. పాత మిషనరీకి రంగులు వేసి రూ. 41.75 లక్షల విలువ చేసే మిషన్లను పాలకవర్గం తీసుకొచ్చి తమకు అంటగట్టారని వాపోయారు. అదేవిధంగా లబ్ధిదారులకు తెలియకుండానే షెడ్ నిర్మాణం చేపట్టి రూ.22 లక్షలకు బదులుగా రూ.45 లక్షల వరకు ఖర్చు అయినట్లు చూపించి బిల్డర్ల ఖాతాలోకి బ్యాంక్ అధికారులు నిధులు మళ్లించారని తెలిపారు.

అయోధ్య రాముడి అక్షింతల వితరణ



ఊరేగింపులో ట్రస్టు సభ్యులు, తదితరులు

హన్మకొండ అర్బన్: నగరంలోని వడ్డెపల్లిలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో డోలు వాయిద్యాలు, సన్నాయి మేళతాళాల మధ్య ఊరేగింపుగా అయోధ్య రాముడి అక్షింతలను ఊరేగిస్తూ బుధవారం ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ చరిత్రలో జనవరి 22వ తేదీ సువర్ణ అక్షరాలతో లిఖించదగినదని చెప్పారు. కార్యక్రమంలో హనుమాన్ దేవాలయ అర్చకుడు వామన్ శర్మ, శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ తెలంగాణ మహా సంయోజక్ ముడుపు యాదిరెడ్డి, వరంగల్ మహానగర సహ సంయోజక్ శ్రీరాం ఉదయ్, సభ్యులు నందాల చందర్‌బాబు, నేలకొండ భాస్కర్‌రావు, అర్చకుడు ప్రవీణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

చెత్తకు నిప్పు.. ప్రజలకు ఇక్కట్లు



చెత్తకు నిప్పుపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ ఆవరణలో ఉన్న చెత్తకుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున నిప్పు పెట్టారు. దాంతో సమీప ప్రాంతాల్లోని ప్రజలు, వ్యాపారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కాలుతున్న చెత్తనుంచి దుర్వాసన రావడంతో చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవలి కాలంలో చెత్తను క్వార్టర్స్ ఆవరణలోనే కాల్చివేస్తుండడాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట ప్రాంతంలో ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాజీపేటలో పోలీసుల తనిఖీలు



కాజీపేట: సంక్రాంతి పండుగ ఆరంభం నుంచి కాజీపేట పట్టణంలో పోలీసుల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానికంగా టౌన్ రైల్వే స్టేషన్‌తో పాటు జంక్షన్, బస్టాండులు, ప్రధాన రహదారుల్లో బుధవారం తెల్లవారుజాము వరకు తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ డేవిడ్‌రాజ్ పర్యవేక్షణలో సీఐ సార్ల రాజు, ఎస్సైలు లవన్‌కుమార్, శివకుమార్ వేర్వేరుగా సిబ్బందితో కలిసి సోదాలు జరిపారు. టాబ్ సహాయంతో అనుమానితుల వేలిముద్రలు సేకరించి గతంలో ఏమైనా కేసులు ఉన్నాయా అనే కోణంలో పరిశీలించారు.

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుపై హర్షం

హన్మకొండ అర్బన్: కేంద్ర ప్రభుత్వ సర్వీసు ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత వైద్య చికిత్సల నిమిత్తం వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ (సీజీహెచ్ఎస్)ను కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, హనుమకొండ జిల్లా శాఖ తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవానికి వస్తున్న సీజీహెచ్ఎస్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఘనంగా స్వాగతం పలుకనున్నట్లు పేర్కొన్నారు.

మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

హన్మకొండ: మున్నూరుకాపు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా –2024 క్యాలెండర్‌ను హనుమకొండ రాంనగర్‌లోని తన స్వగృహంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, మున్నూరుకాపు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, నాయకులు కనుకుంట్ల రవికుమార్, తోట పవన్, పాటి శ్రీనివాస్, పెరుకారి శ్రీధర్, పూజారి సత్యనారాయణ, మాదాసు మొగులయ్య, ముప్ప వేణు, కర్ర సుదర్శన్, శ్రీధర్, నీలారపు శ్రీనివాస్, ఒడిదల రాము, తదితరులు పాల్గొన్నారు.

మేదరి సంఘం క్యాలెండర్..

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర మేదర సంఘం –2024వ సంవత్సర క్యాలెండర్‌ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆవిష్కరించారు. హనుమకొండ భవానీనగర్‌లోని తన స్వగృహంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ, తెలంగాణ రాష్ట్ర మేదర సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రతాపగిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వలపిరెడ్డి సుధీర్ కుమార్, ప్రచార కార్యదర్శి మస్నా విజేందర్, నాయకులు కోరుట్ల రమేష్, చిలువేరు సురేందర్, ప్రతాపగిరి వెంకటరమణ మూర్తి, మస్న కుమార్, రమేష్, తుమ్మల యాకయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ వేములకు ఘన నివాళి



కేయూ క్యాంపస్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన రోహిత్ వేముల వర్ధంతిని బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్ చిత్రపటానికి బీఎస్ఎఫ్ కేయూ ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో అజిత్, అమూల్య, కీర్తికిరణ్, అనూష, రఘువరన్, నరేష్, వినోద్, చరణ్, నిఖిల్, అర్పుజ్, రోహిత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదం



క్రీడాకారులతో రవీందర్‌గౌడ్

ఆత్మకూరు : శారీరక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ అన్నారు. తన తల్లిదండ్రులు ఏరుకొండ వెంకటమ్మ–రాములు, సోదరుడు సాంబయ్య జ్ఞాపకార్థం గ్రామస్థాయి వాలీబాల్ పోటీలను మండల కేంద్రంలో బుధవారం నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు బానిసవ్వద్దని, సన్మార్గంలో పయనించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం లభిస్తుందన్నారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, కిసాన్‌సెల్ అధ్యక్షుడు రేవూరి జయపాల్‌రెడ్డి, మైనారిటీసెల్ మండల అధ్యక్షుడు ఎండి.ఖాజా, నాయకులు కాడబోయిన రమేష్, జిల్లా ఓబీసీ కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు, అలువాల రవి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాధనాశూరుల విన్యాసాలు



మండల కేంద్రంలోని రైతుబజారులో విన్యాసాలు చేస్తున్న సాధనాశూరులు

శాయంపేట : మండల కేంద్రంలోని రైతుబజారులో బుధవారం సాధనాశూరుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన సాధనాశూరులు మంత్రాలు లేవని, మూఢనమ్మకాలను నమ్మవద్దని పాటల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సాధనాశూరులు చింతకింది శంకర్, సమ్మయ్య, శోభన్‌బాబు, మధు, వెంకన్న, గంజి సతీష్, అశోక్, వెంకన్న మనిషి నెత్తిపై కట్టెల పొయ్యి పెట్టి అప్పడాలు కాల్చడం, నీటిలో వేసిన పసుపును ముద్దలుగా తీయడం, తాళ్లతో బంధించడం తదితర విన్యాసాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, సర్పంచ్ కందగట్ల రవి, పద్మశాలి కుల పెద్దలు బాసాని లక్ష్మీనారాయణ, సదాశివుడు, వలుపదాసు వెంకటరమణ, మామిడి చంద్రమౌళి నుంచి సేకరించిన ఆర్థిక సాయాన్ని సాధనాశూరులకు అందించగా వారు కృతజ్ఞతలు తెలిపారు.

దాతలు ముందుకు రావడం అభినందనీయం



జాతర ప్రాంగణంలో ఈఓ శేషగిరితో దాతలు

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతరలో పనులు చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఈఓ శేషగిరి అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశానుసారం వీఐపీ భక్తుల క్యూలైన్ కొరకు స్టీలు రెయిలింగ్ ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ముందుకు వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. బుధవారం ఆయన జాతర క్యూలైన్లను పరిశీలించి అమ్మవార్లను దర్శించుకున్నారు. చౌళ్లపల్లి సర్పంచ్ రవికుమార్, గీసుకొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

వీరస్వామి సేవలు చిరస్మరణీయం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ టీచర్, లయన్స్‌క్లబ్ నాయకుడు కోమటి వీరస్వామి సేవలు చిరస్మరణీయమని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీష్‌రెడ్డి అన్నారు. రిటైర్డ్ టీచర్ వీరస్వామి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించి, వీరస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరితో స్నేహపూర్వకంగా ఉండే వీరస్వామి మరణం జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. ఉపాధ్యాయుడిగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇషాక్ అలీ, కుసుమ వెంకటేశ్వర్లు, బాసాని కోటేశ్వర్, సంతోష్, పల్లేరు వీరస్వామి, బూర భిక్షపతి, కొండ హనుమాన్‌ప్రసాద్, కుమారస్వామి పాల్గొన్నారు.

చదువుపై ఒత్తిడితో యువతి ఆత్మహత్య

పరకాల : చదువుకోవడం ఇష్టం లేని యువతి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాలుపడింది. ఈ సంఘటన పట్టణంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గౌడవాడలో నివాసం ఉంటున్న మాదాసి భాస్కర్ కూతురు భార్గవి (25) పట్టణంలోని ఓ కళాశాలలో బీఎడ్ చదువుతోంది. 2018 సంవత్సరం నుంచి చదువుపై ఇష్టం లేకున్నా తల్లిదండ్రుల సూచన మేరకు బీఎడ్ చేస్తుంది. ఈ క్రమంలో చదువుపై ఒత్తిడితో భోజనం సరిగా తినకపోవడంతోపాటు రాత్రంతా మెలుకువతో ఉండేది. మంగళవారం రాత్రి తల్లిదండ్రులు నిద్రలో ఉండగా బాత్‌రూంకి వెళ్లిన భార్గవి.. ఇనుపరాడ్డుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బాత్‌రూం నుంచి బయటకు రాకపోవడంతో అక్కడకు వెళ్లిన తల్లిదండ్రులకు భార్గవి రాడ్డుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరత్నం తెలిపారు. అయితే ఆమెకు కొంత కాలంగా మానసిక స్థితి బాగులేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

దేవాలయంలో స్వచ్ఛ తీర్థ కార్యక్రమం



వరంగల్ చౌరస్తా: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛ తీర్థ అభియాన్(మన గుడులను శుభ్ర పరుచుట) కార్యక్రమాన్ని స్టేషన్ రోడ్డులోని ఆకారపు కాశీ విశ్వేశ్వర దేవాలయాన్ని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ ఈనెల 14నుంచి 22వ తేదీ వరకు మోదీ ఆదేశాలను సంపూర్ణంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, నాయకులు చీటూరి అశోక్, గంట రవికుమార్, బాకం హరిశంకర్, ఎరుకల రఘునాథ్ రెడ్డి, అపురూప రజనీష్, ధర్మపురి రామారావు, జెట్లింగ్ శివప్రసాద్, అంకాల జనార్దన్, ఇనుముల రాజు, గద్దం భాస్కర్ పాల్గొన్నారు.